# కృషాణ

నా భ్రాతృజాతికొక మర్త్యుడను పరిచయం చేస్తాను
భూతల్లి గర్భంలోంచి పుట్టిన మొదటి మనిషిని గుర్తు చేస్తాను
మీరు చూసే ఉంటారు

అమాయకంగా, మాసిన గుడ్డలతో
ఏదో చెట్టు కింద దిగాలుగా కూర్చున్నప్పుడో

ఆశగా ఆకాశం వైపు చూస్తూ
మరో ఆకలి రాత్రిలో కలిసిపోయినప్పుడో

మనమందరం తిన్న అన్నం మెతుకుకి అంటిన
చెమట వాసనల పరిమళాల్లోనో

బ్రతికేంత తెలివిలేక, కష్టానికి విలువ లేక
దీనంగా, ఓ మూలగా వినిపించిన కృషీవలుడి ఏడుపుల్లోనో

దూరంగా పొలం గట్టున
సేదతీరాల్సిన చెట్టు కొమ్మకే ఉరితాడు కట్టుకొని
ఆనందంగా ఉయ్యాలలూగుతున్న మనిషి ఆగిన ఊపిరుల్లోనో

గడియకో రైతు శవం మోయలేక
అలసి ఆహుతవుతున్న కాష్టాల కష్టాల కన్నీటి మంటల్లోనో

మట్టివాసనలొచ్చిన నాన్న ముద్దుల్లోనో

పొద్దులన్నీ పోయేదాకా మట్టిముద్దల్ని అన్నం ముద్దలు చేసి

గట్టిపడ్డ అమ్మ అరచేతుల్లోనో

నీలోనో, నాలోనో

ఏడుపై వస్తున్న నా కన్నీళ్ల లోనో

ఎక్కడో ఖచ్చితం గా చూసే ఉంటారు.

జాతి కి సహాయం చేసిన అన్నపూర్ణేశ్వరుడు

ఆకలితో, స్వాభిమానం తో

ఎండిన పొలం గట్టున నిలబడ్డాడు ఓసారి చూసొద్దాం

మట్టిలో పుట్టి, మట్టిలోనే బ్రతికి

అదే మట్టిలో కలిసిపోడానికి

తొందర పడుతున్న నిజాయితీపరుడికి

ఓ చిన్న చేయూతనిద్దాం

అందరికీ అన్నంపెట్టిన

అవిశ్రాంత  శ్రామికుడు

అర్ధాంతరంగా అస్తమిస్తున్నాడు

మన అరచేతులన్నీ అడ్డంపెట్టి ఆపుదాం

నేలనేలిన రాజు నలిగిపోతున్నాడు

నాలుగు పచ్చడి ముద్దలు ప్రేమగా తినిపిద్దాం

మనకి బ్రతుకునిచ్చిన మనిషిని బ్రతికిద్దాం

ఎక్కడో పట్టణాలలో

దృడంగా కట్టిన మీ ఇంటి బాల్కనీలో నిలబెట్టి

మీ పిలల్లకి

అన్నం మెతుకులు

వీధిచివరున్న అంగడుల లోంచో

నాన్న తెచ్చిన ప్లాస్టిక్ బ్యాగుల్లోంచో రావని

చచ్చి కుళ్ళిన మనిషి పుర్రెల్లోంచి పుట్టుకొచ్చి నిలబడ్డ భూతల్లి బిడ్డల బిక్షలని

మన బ్రతుకులు,

ఓ నిస్వార్ధ కళాకారుడు

నిత్యం చస్తూ

రక్తం తో గీసిన

చెమట చుక్కల కళాఖండాలని

మన నవ్వులు,

ఏడవడానికి మనిషి లేక

కుటుంబాలని కబళించిన

ఆకలికి మరో రూపాలని

దాయలేని నిజాల్ని నిర్భయం గా చెప్పండి

--Goutham Linga